నవతెలంగాణ

ఆదిలాబాద్

మంగళవారం | అక్టోబర్ 08, 2024 | www.navatelangana.com

ఉద్యోగోన్నతి పొందిన చంద్రశేఖర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న చిళ్లప్ప చంద్రశేఖర్‌కు కార్యనిర్వహణ అధికారిగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం టీఎన్జీవో యూనియన్ ఆదిలాబాద్ పక్షాన ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు సంద అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ, ధర్మదాయ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినందుకు మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్‌కుమార్, గజిటెడ్ ఉద్యోగులు శివ కుమార్, రాజేందర్ దేశ్‌పాండే, అనిల్ పాల్గొన్నారు.



కలెక్టర్, ఎస్‌పిని కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్

నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్‌పి జానకి షర్మిలను విడివిడిగా మర్యాద పూర్వకంగా కలిశారు. బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మహాలక్ష్మి స్కీమ్ గురించి, బస్టాండ్‌లో మంచి నీటి సౌకర్యం, ఉచిత మరుగుదొడ్లు, ప్రయాణికులకు ఫ్యాన్‌లు, కుర్చీలు సమకూర్చారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని డిపో మేనేజర్ తెలియజేశారు. బస్టాండ్‌లో బస్సులు లోనికి వెళ్లేటప్పుడు ఆటోవాలాలు చాలా ఇబ్బంది పెడుతున్నారని, పోలీసు సిబ్బందిని నియమించాలని మేనేజర్ ఎస్‌పిని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట రిజర్వేషన్ ఇన్‌చార్జి టీవి.రమణ ఉన్నారు.



జ్వరంతో మహిళ మృతి

నవతెలంగాణ-కెరమెరి

రెండు రోజుల క్రితం వరకు భర్త, పిల్లలతో ఆనందంగా గడిపిన మహిళ తీవ్ర జ్వరం రావడంతో అంతలోనే తనువు చాలించింది. ఈ విషాద ఘటన సోమవారం మండలంలోని సవార్ ఖేడా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం శారద(25) భర్త శ్రీనివాస్ మేకల కాపరి. శనివారం శారద, శ్రీనివాస్ దంపతులు తమకున్న కొద్దిపాటి చేనులో పత్తి పంటకు పురుగులమందు పిచికారి చేసేందుకు వెళ్లారు. చేనులో పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్నారు. రాత్రి శారదకు జ్వరం రావడంతో ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్య సిబ్బంది సూది, మందులు, అందజేసి రక్త పరీక్షల కోసం మరుసటి రోజు ఆసుపత్రికి రావాలని సూచించారు. దీంతో భర్త శ్రీనివాస్ మరో బంధువు కలిసి సోమవారం ఉదయం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మహిళ ఆసుపత్రికి చేరుకునే లోపు పరిస్థితి విషమించి తీవ్ర అస్వస్థతకు గురైంది. పరీక్షించిన వైద్య సిబ్బంది జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. మృతిరాలికి భర్త శ్రీనివాస్, మూడేళ్ల లోపు ఇద్దరు చిన్నారులున్నారు. అభం, శుభం తెలియని చిన్నారులు తమకిక తల్లి లేదన్న విషయం తెలియక రోధిస్తున్న తీరులో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



సూపర్ మార్కెట్‌లో దొంగతనం

నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

ఓ సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీలోని సాగర్ సూపర్ మార్కెట్‌లో దొంగతనం జరిగింది. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి సూపర్ మార్కెట్‌లో దొంగలు చొరబడి దాదాపు రూ.2.45లక్షల నగదును కాజేశారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సోమవారం ఉదయం సూపర్ మార్కెట్ తెరిచి చూసేసరికి దొంగతనం జరిగినట్లు యజమాని సాగర్ గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ నిధులు రూ.10లక్షల వరకు పెంచాలి



నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్యశ్రీ పథకం కింద నిధులను రూ.10లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 42మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఆస్పత్రి ఖర్చుల కోసం ఎంతో కొంత ఆర్థిక సాయం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకంలో చికిత్సలు చేయించుకున్న, అర్హులు కాకున్నా వారికి అదనంగా ప్రయివేట్ ఆసుపత్రులలో లక్షలు ఖర్చు అయ్యాయన్నారు. వారికి ఎంతో కొంత ఆర్థిక సాయం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లినప్పుడు పూర్తిస్థాయిలో చికిత్స అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికీ ఏ ఒక్క ఆసుపత్రిలో కూడా ఆరోగ్యశ్రీకి సంబంధించిన రూ.10లక్షలు అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లాలామున్న, రఘుపతి, ఆకుల ప్రవీణ్, కృష్ణయాదవ్, రాము, భీంసేనరెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలపై చర్చించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయానికి ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సివిఎస్ రాజు, పలువురు అధికారులు కౌన్సిల్ సభ్యులతో కార్మికులకు చెల్లించే వేతనాల గురించి చర్చించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులను కలిసి వారితో మాట్లాడారు. వేతనాలు చెల్లించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమ్మె విరమింపజేసే ప్రయత్నం చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు కోరారు. అధికారులతో మాట్లాడి వేతనాలు త్వరలోనే చెల్లించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

10న సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సనాతన హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి కోరారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా స్థానిక రాంలీలా మైదానంలో జరిగే విజయదశమి, బతుకమ్మ సంబరాలకు సంబంధించి సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈసారి ప్రత్యేకంగా మహిళల కోసం 10వ తేదీన బతుకమ్మ సంబురాలు జరుపుతున్నామన్నారు. అలాగే 12న దసరా వేడుకలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. సమావేశంలో సమితి సభ్యులు ఉన్నారు.

బతుకమ్మ చీరలు వచ్చేశాయ్..!

- పంపిణీపై ఉత్కంఠకు తెరదించిన ప్రభుత్వం
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు మాత్రమే అందజేత
- ఏజెన్సీలో మాత్రం ఆదివాసీ గిరిజన మహిళలందరికీ
- ఐటీడీఏ పరిధిలోని జిల్లాలకే సరఫరా చేసినట్టు సమాచారం
- త్వరలోనే వీఓల ద్వారా పంపిణీకి సమాయత్తం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బతుకమ్మ చీరలు వచ్చేశాయ్. ఇప్పటికే రావాల్సిన చీరలు పక్షం రోజులు ఆలస్యంగా కావడంతో ఈ ఏడాది పంపిణీ ఉంటుందా..ఉండదా అనే అనుమానాలు తలెత్తాయి. తాజాగా ప్రభుత్వం ఈ ఉత్కంఠకు తెరదించుతూ నిర్ణయం తీసుకుంది. బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. కాకపోతే ఈ సారి అందరికీ కాకుండా కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే వీటిని అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం 18 సంవత్సరాలు నిండిన గిరిజన మహిళలందరికీ అందజేయాలని భావిస్తోంది. కాగా ఐటీడీఏ పరిధిలోని జిల్లాలకే వీటిని పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాకు చీరలు చేరుకోగా..ఆయా మండల సమాఖ్యల్లో వీటిని భద్రపరిచారు. అతి త్వరలోనే వీఓల ద్వారా ఆయా సంఘాల సభ్యులకు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా నిర్వహిస్తున్న బతుకమ్మ పండగకు ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం ఈ పండగను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తోంది. 18ఏండ్లు నిండి..రేషన్ కార్డులో పేర్లు కలిగిన ప్రతి మహిళకు అప్పటి ప్రభుత్వం చీరల పంపిణీ చేపట్టింది. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ ఏడాది బతుకమ్మ చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. దీనిని నిజం చేస్తూ పండగ ప్రారంభమైనప్పటికీ చీరల పంపిణీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ సారి పంపిణీ ఉంటుందా..ఉండదా అనే అనుమానాలు తలెత్తాయి. సోషల్ మీడియాలోనూ ఈ విషయం ప్రధానంశంగా మారింది. వాస్తవానికి పండగకు పదిహేను రోజుల ముందుగానే జిల్లాకు చీరలు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం జాప్యం చేసింది. తాజాగా ఆయా జిల్లాలకు పంపిణీ చేస్తూ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలో కొన్ని మండలాలకు చేరుకోగా.. మిగితా వాటికి సైతం రోజువారీగా చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు.

ఎస్‌హెచ్‌జీ, గిరిజన మహిళలకే పంపిణీ..!

గత ప్రభుత్వం 18ఏండ్లు నిండిన మహిళలందరికీ చీరలు పంపిణీ చేయగా.. ఈ ప్రభుత్వం బతుకమ్మ చీరలను స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు మాత్రమే పంపిణీ చేయాలని యోచిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం 18ఏండ్లు నిండిన గిరిజన మహిళలందరికీ అందజేయాలని భావిస్తోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 2,02,297 మంది మహిళలకు చీరలు పంపిణీ భావించగా.. ఇందులో ఎస్‌హెచ్‌జీ మహిళలు 1,18,545మంది ఉండగా గిరిజన మహిళలు 83,752 మందికి వీటిని అందజేయనున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మండలానికి 19,920 చీరలు రాగా.. బోథ్‌కు 20,640, ఉట్నూర్‌కు 12,600, నార్నూర్ మండలానికి 12,960 చీరలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ చీరలను మండల సమాఖ్యల్లో భద్రపర్చగా.. అక్కడ్నుంచి నేరుగా గ్రామాల్లోని వీఓలకు అందజేయనున్నారు. వారి ద్వారా మహిళలకు అందించనున్నట్లు తెలిసింది. కాగా మంచిర్యాల జిల్లాలో ఇప్పటి వరకు 1.37లక్షల చీరలు వచ్చినట్లు తెలిసింది. పట్టణాల్లో మెప్మా పరిధిలో ఉండే సంఘాల సభ్యుల వివరాలు సైతం సేకరించిన అధికారులు వాటిని ప్రభుత్వానికి నివేదించారు. కానీ వీరికి పంపిణీ చేస్తారా..? లేదా అనే విషయం మాత్రం స్పష్టత రావడం లేదు. కాగా జిల్లాలో ఇప్పటికే పండగ ప్రారంభమైనప్పటికీ.. ఈ చీరలను పంపిణీ ఎప్పటి నుంచి ఉంటుందోననే విషయం మాత్రం స్పష్టత రావడం లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి.



పంపిణీపై ఆదేశాలు రాలేదు :
సాయన్న, డీఆర్‌డీఓ, ఆదిలాబాద్

ప్రభుత్వం బతుకమ్మ చీరలను సరఫరా చేస్తోంది. జిల్లాకు ఇంకా పూర్తిగా చేరుకోలేదు. ఎస్‌హెచ్‌జీ, గిరిజన మహిళలకు పంపిణీ చేయాలని అలాట్‌మెంట్ ఇచ్చారు. ఎప్పటి నుంచి పంపిణీ చేయాలా అనే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా మాకు ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల ప్రకారం పంపిణీపై చర్యలు తీసుకుంటాం.



పండుగకు కార్మికులు పస్తులుండాలా?

- మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్ల ఎదుట కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడారు. పండుగకు కూడా పస్తులుండాలా? అని ప్రశ్నించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమాన్ని ఏమాత్రమూ ఖాతరు చేయడం లేదన్నారు. మల్టీపర్పస్ విధానంతో అనేక రకాల పనులు చేయిస్తున్నారన్నారు. వరుస పండుగలు వస్తున్నా ఇప్పటి వరకు వేతనాల గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. సమ్మె సందర్భంగా అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. నేటికీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. విలేజ్ వాటర్ అసిస్టెంట్లుగా నియమిస్తున్న సిబ్బంది అందరికీ సీనియారిటీ పరిగణలోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.5లక్షలకు పెంచాలని, 2011 జనాభా ప్రాతిపదికన కార్మికులను తీసుకోవాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.20 అందించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, జీఓ 51ని సవరించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, నాయకులు అగ్గిమల్ల స్వామి, నగేష్, గంగన్న, గంగయ్య, వెంకట్‌రావ్, ప్రకాష్, ఇంద్రజ్, ఆత్రం సోనేరావ్ పలువురు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నిర్మల్ : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మెన సురేష్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు లేక పండగ ఎలా జరుపుకోవాలని ప్రశ్నించారు. కార్మికులు పండగ సంతోషంగా జరుపుకోవాలంటే పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.నర్సయ్య, ఉపాధ్యక్షులు మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, నాయకులు పోశెట్టి, లింగన్న, నర్సయ్య, రాజేందర్, సాయన్న పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

దురహంకారంతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు

- వామపక్షాల ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సామ్రాజ్యవాద దురహంకారంతో అమెరికా కనుసన్నల్లో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తోందని సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు దర్శనాల మల్లేష్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇజ్రాయిల్ దుశ్చర్యలను వ్యతిరేకిస్తూ గాజాలో పాలస్తీనులకు సంఘీభావం తెలుపుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆ దేశ దిష్టిబొమ్మను దహనం చేశారు. దాడులు ఆపి శాంతిని పాటించాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి నేటికి ఏడాది గడుస్తోందన్నారు. యుద్ధనీతిని మరిచి మసీదులు, ఆస్పత్రులు, సామాన్యులపై బాంబుల వర్షం కురిపిస్తున్నారన్నారు. మసీదులు, పాఠశాలలు, చిన్నపిల్లలు మొదలు పండు ముసలి వరకు దాడులు చేస్తూ హతమార్చడం అమానవీయమని తెలిపారు. ఇప్పటి వరకు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందన్నారు. ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని రెండేండ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నా ఇజ్రాయిల్ అమెరికా సహకారంతో యుద్ధం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను చూస్తే మూడో ప్రపంచ యుద్ధం వచ్చే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల క్రితం కరోనాతో ప్రపంచం అతలాకుతలం అయిందన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ న్యాయస్థానం, ఐక్యరాజ్య సమితి కూడా దాడులు ఆపాలని సూచించాయని పేర్కొన్నారు. కాని దాడులు మాత్రం ఆగడం లేదన్నారు. వెంటనే దాడులు ఆపి శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బండి దత్తాత్రి, సీపీఐ నాయకులు కుంటల రాములు, ఎస్.అరుణ్‌కుమార్, మహిళా సంఘం నాయకురాలు అమీనాఖాన్, సీపీఐ(ఎంఎల్) నాయకులు వెంకట్‌నారాయణ, మాస్‌లైన్ నాయకులు జగన్ పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సహానికే సీఎం కప్ అవగాహనా ర్యాలీ

ఆదిలాబాద్‌టౌన్ : గ్రామీణ క్రీడలను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ అవగాహనా ర్యాలీ నిర్వహించామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లాకు ర్యాలీ చేరగా సోమవారం ఉదయం స్టేడియం నుంచి కలెక్టర్ చౌక్ వరకు క్రీడ జ్యోతి చేపట్టారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే ముందుగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి జ్యోతితో పరుగులు తీశారు. హైదరాబాద్ నుంచి ర్యాలీలో వచ్చిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ర్యాలీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ముగింపు తరువాత గ్రామ, మండల స్థాయిలో పోటీలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ నెల 21 నుంచి పోటీలు నిర్వహించేలా ప్రభుత్వ ఆదేశాలున్నాయని, దానికి అనుగుణంగా ప్రణాళికలతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ వసతులు కల్పించేలా కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఖేలో ఇండియా పేరుతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ క్రీడాకారులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడల పట్ల శ్రద్ధ కనబరుస్తు జిల్లా కేంద్రంలో స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌస్ ఆలం, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాభివృద్ధి అధికారి పార్థసారధి, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-సిరికొండ

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని సిరికొండ బీట్ ఆఫీసర్ కాలేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలోని అడవిలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. అడవిని కాపాడితేనే వన్యప్రాణులను సంరక్షించేందుకు దోహదపడుతుందని తెలిపారు. వేటగాళ్ల బారిన పడి వన్యప్రాణులు అంతరించి పోతున్నాయన్నారు. వన్యప్రాణులను కాపాడడం మన బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి బీట్ ఆఫీసర్ హీరాలాల్, బేస్ క్యాంప్ సిబ్బంది నిరంజన్, మారుతి, లేతూ, జంగు, రమేష్ పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామపంచాయతీ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ఎంపీడీఓ వెంకట రమేష్ మాట్లాడుతూ వర్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మంచినీటిని అందించేందుకు నీటి



ట్యాంకులను బ్లీచింగ్‌తో ప్రతి నెల క్లోరినేషన్ చేయాలని అన్నారు. పైప్‌ల లీకేజీలకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని వెల్లడించారు. లేని యెడల నీరు కలుషితమై ప్రజలు ఆ నీటిని తాగి వ్యాధుల బారిన పడతారని దీన్ని దృష్టిలో పెట్టుకొని శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ శ్రీకాంత్, ఎంపీఓ సోలమన్‌రాజ్ పాల్గొన్నారు.

2

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

మంగళవారం | అక్టోబర్ 08, 2024 | www.navatelangana.com

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గంగన్నపేట రైతులు అన్నారు. సోమవారం మండలంలోని గంగన్నపేట రైతులు పొలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డీఈ సుభాషిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గత 40 సంవత్సరాల ముందు వేసిన విద్యుత్



స్తంభాలు చేనులో వంగిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వల్ల పొలాలకు నీరు అందడం లేదని అవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో బోర్లకుంట రాజన్న, ముంజం ఆశన్న, మోహన్, పరశురాం, రమేష్, మల్లయ్య రాజేష్ ఉన్నారు.

ఏజెన్సీ డీఎస్సీ వేయాలి

- గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం నిర్వహించిన జనరల్ డీఎస్సీలో ఆదివాసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, గిరిజన ప్రాంతంలో టీచర్ పోస్టుల భర్తీకి ఏజెన్సీ డీఎస్సీ వేయాలని, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో స్థానిక గిరిజన అభ్యర్థులతో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, జీఓ నెం.3ను పునరుద్ధరణ చేయాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అనుమతులు లేక ఆగిపోయిన గిరిజన ప్రాంతంలోని గ్రామాల రహదారులకు ఫారెస్ట్ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, నాయకులు సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు.

రైతు అవగాహన సదస్సు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని టెంబి గ్రామంలో ట్రాక్టర్ బ్రాండ్ ఆధ్వర్యంలో పత్తి రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా వరల్డ్ కాటన్ డే సందర్భంగా పత్తి పండించే రైతులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ పత్తి పంటలో మేలైన సస్యరక్షణ కోసం అధిక దిగుబడి కోసం ట్రాంక్టర్ బ్రాండ్ కంపెనీ, శిన్య, హెర్కిలస్ జోడి నెంబర్-1 అనే మందుని ఉపయోగించడం వల్ల రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులుసేల్స్ ఆఫీసర్ గణేష్‌రెడ్డి, సేల్స్ రిప్రజెంట్ సాయి, రైతులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర మంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛమందించి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను ఆమెకు వివరించారు.

కొలలాడిన కలెక్టర్ దంపతులు

- పోలీసుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో కలెక్టర్ రాజర్షి షా దంపతులు, సెకండ్ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఎస్పీ గౌష్ ఆలం కుటుంబ సభ్యులు, జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మకు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ డీజే పాటలకు నృత్యాలు కొలాలు వేస్తూ సందడి చేశారు. దీంతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. కాగా అధికారులు సైతం కొలాలు ఆడుతూ ఉత్సహపరిచారు.

ఐకేపీ కార్యాలయానికి చేరిన బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేడాది ఆడపడుచులకు కానుకగా అందించే బతుకమ్మ చీరలు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం మైస రమేష్ గ్రామాల వారీగా చీరలను సర్దుబాట చేశారు. మండలానికి మొత్తం 12,960 బతుకమ్మ చీరలు వచ్చినట్టు తెలిపారు. వారి వెంట సీసీ శ్రీరాం కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ అన్నారు. సోమవారం మండలంలోని పర్యటించిన అనంతరం నాయకులు అతనికి స్వాగతం పలికారు. కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియపర్చాలని సూచించారు. ముందు వచ్చే గ్రాడ్యుయేట్ ఎన్నికలతో పాటు ఇతర ఎన్నికలకు కూడా సిద్ధం కావాలని నాయకులను, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి కొండారి రమేష్, నాయకులు అడ్వొకేట్ జగన్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ జగ్జీవన్, మాజీ ఎంపీపీ ధనలాల్, మాజీ వైస్ ఎంపీపీ బాలాజీ, కిరణ్, సతీష్‌రావు, రామ్‌చందర్, నాగభూషణ్, రమేష్ పాల్గొన్నారు.

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం బీర్సాయిపేట్ గ్రామానికి చెందిన కుమురం రాంబాయి తనకి గొర్రెల లోన్ ఇప్పించాలని, ఆదిలాబాద్ మండలం తలమద్రి గ్రామానికి చెందిన నాగోరావ్ తనకి ట్రైకర్ పథకం కింద లోన్ మంజూరు చేయాలని కోరారు. లింగాపూర్ మండలం మెడిగూడ గ్రామానికి చెందిన తొడసం భగవంత్‌రావు తనకు భూమి ఇప్పించమని, ఆదిలాబాద్ మండలం తిప్పరాజగూడ గ్రామానికి చెందిన కొడప భీమ్‌రావు తనకి ఏడ్ల జత ఇప్పించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏడీఎం, డీఎంహెచ్ఓ కుడిమేత



మనోహర్, ఏఓ దామోదర్, పీహెచ్ఓ సందీప్ కుమార్, జెడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



నవతెలంగాణ-నిర్మల్

మున్సిపాలిటీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత 5 రోజులుగా సమ్మె చేస్తున్నారు. వారి సమ్మెకు సీఐటీయూ, టీఏజీఎస్, ఎన్‌పీఆర్‌డీ నాయకులు సోమవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకులు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు ఫసిఉద్దీన్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి శంభు మాట్లాడారు. వేతనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మికులు దసరా, దీపావళి పండుగలను జరుపుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఈ సమస్యపై కాంగ్రెస్ పాలక వర్గాన్ని మద్దతు ఇస్తూ, వేతనాలు కాంగ్రెస్ పాలక వర్గం ఇచ్చినప్పుడు తీసుకోవాలని ఉచిత సలహా ఇవ్వడం ప్రజా ప్రతినిధిగా ఇది తగదని దుయ్యబట్టారు. కార్మికులు సమ్మె చేయకుండా, ఉండాలనీ, పండుగల తర్వాత వేతనాలు ఇస్తామన్నా పాలక వర్గం ప్రకటనను ప్రజా సంఘాలు ఖండిస్తున్నాయనీ అన్నారు. కార్మికుల శ్రమకు న్యాయం చేయాలని, వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్ పరిణామాలకు పాలక వర్గం బాధ్యత వహించావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

- రిమ్స్‌లో నాలుగు డయాలసిస్ మిషన్‌ల ప్రారంభం
- ప్రారంభించిన రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డయాలసిస్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్‌లోని డయాలసిస్ వార్డులో అదనంగా నాలుగు పరికరాలను ఆయన ప్రారంభించారు. ముందుగా పూజలు చేసి నూతన మిషన్‌లను ప్రారంభించారు. ఇబ్బందులు లేకుండా చూడాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రంలో 11మిషన్‌లు ప్రస్తుతం ఉన్నాయని అన్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే రోగులతో పాటు పాము కాటుకు వచ్చిన సమయంలో ఇబ్బందులు వచ్చేవని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రెండు నెలల తరువాత నాలుగు మిషన్‌లు వచ్చాయని అన్నారు. అత్యవసర సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డయాలసిస్ చేస్తామన్నారు. మొత్తం 15మిషన్‌లు రిమ్స్‌లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్



డాక్టర్ అశోక్, ఆర్ఎంఓ తొడసం చందు, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ కల్లెం వెంకటరెడ్డి, ఆరోగ్యశ్రీ డీఎం సత్యనారాయణ, డయాలసిస్ ఇన్‌చార్జి ప్రేమ్‌దాస్, నర్సింగ్, సూపరింటెండెంట్ పెద్దపెల్లి రమాదేవి, డయాలసిస్ కేంద్రం సిబ్బంది గణేష్, దీక్ష, రాణి ఉన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరకే తమ పంటలను అమ్ముకోవాలి



నవతెలంగాణ-తాంసి

రైతులు కాయకష్టం చేసి పండించుకున్న తమ పంటలను ప్రభుత్వ మద్దతు ధరకే అమ్ముకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. మొదటగా రైతులను ఇరువురు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వెన్నంటే ఉంటూ సోయాబిన్‌కు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.4895 ధర నిర్ణయించిందన్నారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతులను అన్ని విధాల ఆదుకోవడాని ఎంతో కృషి చేస్తోందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. పంటలను ఎలాంటి నిబంధన లేకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కరెంటు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకురాగా, వెంటనే సబ్ స్టేషన్‌కు వెళ్లి రిజిస్టర్లను పరిశీలించి, మండల విద్యుత్ అధికారికి ఫోన్ చేసి ఇబ్బందులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వ్యవసాయ పంటలకు, త్రీఫేజ్ విద్యుత్తును సరఫరా చేయాలని, లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కేశవ్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బదిలీ అయిన ఉపాధ్యాయుల జూన్ నెలకు సంబంధించిన వేతనాలు వెంటనే జమ చేయాలని టీఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లా ఖజానా అధికారి హారికను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన వేతనాలు ఇంతవరకు జమకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే మంజూరు అయ్యేటట్టు ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని కోరారు. అన్ని రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులు పండుగలను జరుపుకోలేని స్థితిలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన విధంగా అన్ని పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తూ పెండింగ్ డీఏలను, ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన సవరణను త్వరలోనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల కాలంగా పెండింగ్‌లో ఉన్న జెడ్పీజీపీ, టీఎస్జీఎల్‌యూ సంపాదిత సెలవుల మెడికల్ బిల్లులకు రిటైర్‌మెంట్ అయిన



ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు అయ్యేవిధంగా ఉన్నతాధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని కాపాడాలి



నవతెలంగాణ-తలమడుగు

ప్రభుత్వరంగ సంస్థ ఎల్ఐసీని కాపాడాలని ఎల్ఐసీ అల్ ఇండియా నాయకుల పిలుపు మేరకు సోమవారం ఆదిలాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ భాస్కర్‌తో పాటు సిబ్బంది కృష్ణకు ఎల్ఐసీ ఏజెంట్లు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రయివేటు భీమా కంపెనీలకు తొత్తుగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ బీమా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే ఐఆర్‌డీఏ పావులు కదుపుతుందని ఏజెంట్లు పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ఐఆర్‌డీఏ తీసుకోవడం ప్రభుత్వ బీమా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ఐఆర్‌డీఏ విధానాలను మార్చుకోవాలంటూ ఎల్ఐసీ ఏజెంట్లు విన్నవించారు. ఏజెంట్ రంగాన్ని పూర్తిగా నియంత్రించి నిర్వీర్యం చేసేందుకు పావులు కదుపుతుందన్నారు. బీమారంగాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్ఐసీ ఏజెంట్లు మేకల మల్లన్న, ఆశన్న, దిగంబర్, చందర్, ఊశన్న, రమణయ్య, దీపక్ అగర్వాల్ ఉన్నారు.

కేజీబీవీ అదనపు గదులకు భూమిపూజ



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో రూ.2.30కోట్లతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన భవనానికి నిధులు కేటాయించి సుందరంగా నిర్మించామని తెలిపారు. త్వరలో ఈ భవనాన్ని కూడా పూర్తి చేసి రెండు భవనాలను ఒకేసారి ప్రారంభించే విధంగా పనులను నాణ్యతతో చేడానికి గుత్తేదారు శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ ప్రాంత నాయకులు కూడా పనుల పర్యవేక్షణ చేయాలన్నారు. జందాపూర్ నుండి కరంజి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో పనులను పూర్తి చేసే విధంగా చూసే బాధ్యత తనదే అని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు లస్మన్న, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, లింబాజి, సంతోష్, సంజీవరెడ్డి, ఉత్తం రాథోడ్, కల్చప్‌యాదవ్, అనిల్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తాంసి బస్టాండ్ ఏరియాలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తక్షణమే కూల్చివేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మాల్యాల మనోజ్ అన్నారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో అక్కడ ఏర్పాటు చేసిన లేఅవుట్ స్థలంలో నిబంధనల ప్రకారం పార్కు నిర్మాణం కొరకు ఉంచిన స్థలాన్ని స్థానిక ఆదిలాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేశారని ఆరోపించారు. వ్యక్తి అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి అక్రమ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. తక్షణమే స్పందించి ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ జరిపించి, ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. తప్పుడు ధృవీకరణ పత్రాలతో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి, ప్రజా ప్రయోజనల నిమిత్తం ఈ ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వం ఆధీనం చేసుకోవాలని విన్నవించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తాంసి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని రూ.1లక్ష 116 మాత్రమే అందజేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నిక సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తానని మాటిచ్చారని, కాని ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, సంతోష్, రమేష్ మహేందర్, గోవర్ధన్‌రెడ్డి, రమణ, రఘు, అశోక్, రజిని, కాంతారెడ్డి, నితిన్ కుమార్, రామన్న యాదవ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నేరడిగొండ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని లఖంపూర్ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సందర్భంగా హెచ్ఈఓ మాట్లాడుతూ టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వ్యాధులు దోమలతో వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అప్పుడే దోమలు వృద్ధి చెందవని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ నీటిని వేడి చేసుకొని, చల్లారిన తర్వాత తాగాలని, వర్షాలు పడటంతో నీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ వైద్యశిబిరంలో సూపర్‌వైజర్ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ గోదావరి పాల్గొన్నారు.

మద్యాన్ని నిషేధించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఏజెన్సీలో మద్యాన్ని నిషేధించాలని, బెల్టు షాపులను నిలిపి వేయాలని మండలంలోని లింగుగూడ రాయిసెంటర్ ఆధ్వర్యంలో సార్మేడి జుగ్నాక్ శంభు, 9తెగల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మద్యం వల్ల ఎందరో మంది ప్రజలు ముఖ్యంగా యువత చెడిపోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్ర జంగు పటేల్, కొడప సోనేరావు, సిడం లక్ష్మణ్, మరప రాంచందర్, పెందూర్ మోహన్, అర్క శేషారావు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం మరమ్మతులు

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని సోమిని గ్రామస్తులకు బస్ నడిచే విధంగా రహదారికి మరమ్మత్తులు చేయిస్తానని ఇచ్చిన మాటకు అనుగుణంగా ఎమ్మెల్సీ దండే విఠల్ కృష్ణపెల్లి-సోమిని ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు రహదారిపై మొరం వేసి తాత్కాలిక మరమత్తు పనులు చేయించారు. ఈ పనులను టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీకి ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పంద్రం పుష్పలత, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓం ప్రకాష్, నాయకులు ఫాసిఖాన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పంపిణీ చేశారు. మొత్తం 35 మంది లబ్దిదారులకు రూ.13.69 లక్షలు మంజూరు కాగా వీరికి ఎమ్మెల్యే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా అవినీతికి తావు లేకుండా తాము ఈ చెక్కులను లబ్దిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లబ్దిదారులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

నీళ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని లంబాడిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లంబాడిగూడ గ్రామానికి చెందిన అల్లూరి లక్ష్మి(44) వ్యవసాయ చేనులో పత్తి పంటకు పురుగులమందు పిచికారి చేస్తున్న గ్రామంలో స్ప్రేయర్ డబ్బాలో నీళ్ల పోయడానికి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద నీళ్లు చేరుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిందని ఏఎస్సై పేర్కొన్నారు. మృతురాలి భర్త లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ రాజకీయ పునరావసరం కాదు

- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన సమయంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ కొన్ని సంవత్సరాలుగా కేవలం ఓడిపోయిన రాజకీయ నాయకులకు పునరావాసంగా తయారైందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన మొదట అంబేద్కర్, కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని తిరుమల లాడ్జిలో నిర్వహించినంతరం మాట్లాడుతూ గత ఎన్నికల్లో జిల్లాలో కేవలం 4 వేల మంది మాత్రమే పట్టభద్రులు నమోదు చేసుకున్నారని ఇది అవగాహన లోపమేనని అన్నారు. ప్రస్తుతం నమోదు ముమ్మరంగా చేయడానికి ప్రత్యేకంగా కార్యాలయం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 2021 కంటే డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు తమ కార్యాలయంలో సంప్రదించి ఓటు నమోదు చేసుకోవాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవి కేవలం పునరావాసంగా మారిందని అలా కాకుండా తనకు అవకాశం ఇస్తే ఉమ్మడి నాలుగు జిల్లా కేంద్రాల్లో స్టడి సర్కిల్స్ ఏర్పాటు చేస్తానని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ స్టడి సర్కిల్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లో వస్తున్నట్టు చెప్పారు. గురుకులాల్లోని విద్యా వ్యవస్థలో ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ గెస్ట్, గంటల ప్రాతిపదిక వ్యవస్థ కొనసాగుతుందని, వీటిని కాంట్రాక్ట్‌గా మార్చడంతో పాటు రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన ఓకేషనల్ సిబ్బందిని రెగ్యులర్ చేయించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఒకసారి ఆశీర్వదిస్తే ఐదు సంవత్సరాలు సేవ చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం పలువురు ఆయనను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందాని ఉపకేంద్రంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామంలోని ఉప కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించి గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ మాట్లాడుతూ గర్భిణులు ప్రసూతి సమయంలో వారం ముందే ఆస్పత్రిలో చేరాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం శిబిరంలో 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాదపడుతున్న ముగ్గురి రక్త నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మమత, హెల్త్ అసిస్టెంట్ కాంత, భగవన్ దాస్, ఆశావర్కర్ కమల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాదసంచాలన్ కార్యక్రమం ముగింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మూడు రోజులుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదసంచాలన్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో పదసంచాలన్ చేస్తూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఇది పలు వీధుల గుండా ఎస్పీఎం క్రీడా మైదానం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా మేడి రాయిసెంటర్ నాయకుని బర్తరఫ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా మేడి రాయిసెంటర్ నాయకుడిని బర్తరఫ్ చేశారు. జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలో గత నెల 18న నిర్వహించిన పోలీసుల సమావేశంలో ఆదివాసీ ఉపాధ్యాయులపై జిల్లా మేడి రాయి సెంటర్ నాయకుడు మోతిరాం వ్యాఖ్యలు ఖండిస్తూ వాటిని వెనక్కి తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రాల్లోని ఆదివాసీ భవనంలో నిర్వహించిన సమావేశంలో మొతీరాం ఒప్పుకోకపోవడంతో ఆయనను సెంటర్ నుండి బర్తరఫ్ చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు పాల్గొన్నారు.



సమస్యల నిలయాలు..గ్రంథాలయాలు..!

- సౌకర్యాల లేమి..నిర్వహణ లోపాలు
- నిర్లక్ష్యానికి గురవుతున్న విజ్ఞాన భాండాగారాలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత

గ్రంథాలయం అనేది విజ్ఞాన భాండాగారం. పుస్తకాలు ఇక్కడ పుష్కలంగా లభిస్తాయి. జ్ఞానం పుష్టిగా దొరుకుతోంది. దీని ద్వారా సామాజిక చైతన్యం, సమకాలిన అంశాలపై అవగాహన, మానవత విలువలు అబ్బుతాయి. పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉండడంతో నిరుద్యోగులకు మేలు చేకూరుస్తున్నాయి. అయితే గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వీటిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఇవీ నిరాదరణకు గురవుతున్నాయి. నిర్వాహణ లోపం వల్ల పాఠకుల అడుగులు గ్రంథాలయాల వైపు పడటం లేదని తెలుస్తోంది.



కెరమెరిలో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం



శిథిలావస్థలో వాంకిడి మండల కేంద్రంలోని గ్రంథాలయం

నవతెలంగాణ-కెరమెరి

ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలున్నాయి. వీటిలో కొత్తగా ఏర్పడిన లింగాపూర్, చింతలమానేపల్లితో పాటు పలు మండలాల్లోని గ్రంథాలయకు సొంత భవనాలు లేవు. కెరమెరిలో అద్దె భవనంలో కొనసాగుతుండగా మరికొన్ని ప్రభుత్వ పురాతన భవనాల్లో మరి కొన్ని మండలాల్లో గ్రంథాలయాలే లేవు. ఐదు మండలలాలకు మాత్రమే గ్రంథాలయ అధికారులున్నారు. సిర్పూర్(యు), నూతనంగా ఏర్పడిన చింతలమానేపల్లి, లింగాపూర్, తిర్యాణి, లింగాపూర్, పెంచికలపేట్ మండలాల్లో గ్రంథాలయాలు అసలే లేవు. కెరమెరి మండల కేంద్రంలోని గ్రంథాలయం 25 ఏండ్ల పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇరుకైన గదిలో కొనసాగింది. రెండేళ్ల క్రితం శిథిలావస్థకు చేరగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కూల్చివేసి కూరగాయల మార్కెట్ కోసం షెడ్డు నిర్మించారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. భవన నిర్మాణం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. మండలంలోని 52 గ్రామాలకు మండల కేంద్రంలో ఒక గ్రంథాలయలమే ఉంది. మండలంలోని చాలామంది విద్యార్థులు డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేసిన వారు ఉన్నారు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే మండల మొత్తానికి ఉన్న ఏకైక గ్రంథాలయంలో సమస్యలు నెలకొన్నాయి. విరిగిన కుర్చీలు, అరకొర పుస్తకాలు, రెండు మూడు దినపత్రికలు మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. గదిలో ఫ్యాన్ లేదు. పాఠకులు ప్రశాంత వాతావరణంలో చదువుకునే పరిస్థితి లేదు. మూడు కుర్చీలు మాత్రమే ఉన్నాయి. ఎన్నో ఏండ్లుగా స్వీపరే గ్రంథాలయ బాధ్యతను చూస్తున్నారు. కొన్నినెలలుగా స్వీపర్ అనారోగ్యంతో బాదపడుతుండటంతో అతని భార్య ఉదయం, సాయంత్రం గ్రంథాలయాన్ని తెరుస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

భవనాలు, సౌకర్యాలు లేక..

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ గ్రంథాలయాల్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందంగా గ్రంథాలయ నిర్వహణ కొనసాగుతోంది. గ్రంథాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలున్నాయి. నవలతో పాటు మహానుభావుల చరిత్ర గ్రంథాలు, కవిత సంపుటాలు, డిక్షనరీలు,సైన్స్ ప్రయోగాలకు సంబంధించిన పుస్తకాలు సైతం ఉన్నాయి. వీటితో పాటు వార పత్రికలు, మ్యాగ్జిన్, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార స్రవంతి పత్రికలు ఉన్నాయి. అయితే వీటిని సద్వినియోగం చేసుకునే వారు తగ్గుతున్నారని తెలుస్తోంది. గ్రంథాలయాల నిర్వహణ లోపంతో పాటు డిజిటల్‌వైపు వాటిని తీర్చిదిద్దడంతో ప్రభుత్వాలు విఫలం కావడమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి.

పత్తా లేని పన్నులు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి గ్రామపంచాయతీ నిధుల నుంచి ఎనిమితి శాతం నిధిని కేటాయించాల్సి ఉంది. ఆ నిధులతో గ్రంథాలయాల అభివృద్ధికి వినియోగించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏ గ్రామపంచాయతీలో కూడా ఆ నిధులను అపపగించిన దాఖలాలు కానరావడం లేదు. గ్రామపంచాయతీ అధికారులతో పాటు గ్రంథాలయాల జిల్లా అధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

మెటీరియల్ అందుబాటులో ఉంచాలి

గైక్వాడ్ నిఖిల్, నిరుద్యోగి కెరమెరి



నేను కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాను. దానికి సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో లేవు. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సివస్తోంది. గ్రంథాలయంలో పుస్తకాలుంటే మాలాంటి వారికి మేలు జరిగేది. పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

గ్రంథాలయానికి స్థలం కేటాయించాలి

పెందూర్ శ్రీనివాస్, సాకడ గ్రామం



గ్రంథాలయం ఎక్కడ ఉందో కూడా తెల్వాదు. గతంలో పాత గ్రామ పంచాయతీలోని ఇరుకైన గదిలో ఉండేది. 25 ఏండ్లుగా గ్రంథాలయానికి సొంత భవనం లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీ పరీక్షలప్పుడు నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి నూతన భవన నిర్మాణానికి పాలకులు చొరవ చూపాలి.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

హనుమాండ్ల శంకరయ్య రిటైర్డ్ ఉద్యోగి తిర్యాణి



మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం గత పదేళ్ళుగా చేయని ప్రయత్నం లేదు. ఉన్నతాధికారులను, పాలకులను కలిసి విన్నవించినా ఫలితం లేదు. గ్రంథాలయం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పోటీ పరీక్షలకు ఎదురు చూసే వారికి ప్రశాంతంగా చదువుకోవడానికి గ్రంథాలయం ఎంతో అవసరం. అధికారులు స్పందించి గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేయాలి

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గ్రామపంచాతీ కార్మికుల డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తున్న మల్టీపర్పస్ విదానాన్ని రద్దు చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ప్రతి నెల ఒకటో తేదిన వేతనాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి సంవత్సరం రెండు జతల బట్టలు, నూనెలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన రూ.పది లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, పెరక శ్రీకాంత్, కోశాధికారి శంకర్, ఉపాధ్యక్షుడు రమేష్, అనిల్, శంకర్, రాజ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వసంత్, అశోక్, భార్గవ్ పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాలస్తీనపై మరణ హోమం మొదలై సంవత్సరం పూర్తయిందని అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని వామపక్ష సంఘాల నాయకులు అన్నారు. అమెరికా సామ్రాజ్యవాధాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట సామ్రాజ్యవాద దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా పాలస్తీనాపై అమెరికా దౌర్జన్యం కొనసాగుతుందన్నారు. ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని వెంటనే దానిని సవరించేలా అన్ని దేశాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎండీ.చాంద్ పాషా, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, పట్టణ కమిటీ సభ్యులు శన్ను, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తిక్, సీపీఐ జిల్లా నాయకులు ఆత్మకూరి చిరంజీవి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- జిల్లా కేంద్రంలో సీఎం కప్ టార్చ్‌లైట్ ర్యాలీ



క్రీడా జ్యోతితో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. నవంబర్‌లో నిర్వహించనున్న సీఎం కప్‌కు సంబంధించి గచ్చిబౌలి స్పోర్ట్స్ అధికారి అలెగ్జాండర్, ర్యాలీ నోడల్ అధికారి సీఐ కన్నం మధుబాబుల ఆధ్వర్యంలో టార్చ్‌లైట్ ర్యాలీ జిల్లా కేంద్రానికి చేరుకుంది. సోమవారం జిల్లా క్రీడల అధికారిణి రమాదేవి అధ్యక్షతన ర్యాలీకి ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డితో కలిసి క్రీడా జ్యోతి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేది వరకు ర్యాలీ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేయడానికి గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి కప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడలతో క్రీడాకారుల్లో టీం స్పిరిట్ పెంపొందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో పోటీలు నిర్వహించినంతరం మండల, జిల్లా స్థాయిలో నిర్వహించి రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాలను ప్రోత్సహించేల ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంతోష్, మాజీ ఎంపీపీలు బాలేష్ గౌడ్, మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు చరణ్, అబ్దుల్లా, శ్యామ్, కోచ్‌లు తిరుపతి, రాకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను హిందూ ఉత్సవ సమితి నాయకులు పరిశీలించారు. ఎస్పీఎం క్రీడా మైదానంలో ఈ నెల 10న సద్దుల బతుకమ్మ పండుగను హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న విషయం తెల్సిందే. కాగా ఈ పండుగ ఏర్పాట్లను వారు పరిశీలించి బతుకమ్మ ఆడే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి నాయకులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సభ్యులు తుమ్మ రమేష్, హన్మంత్‌రావు, రాజ్‌కుమార్ యాదవ్, తాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 9న హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నందున అభ్యర్థులను తీసుకువెళ్లేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారిలతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుండి అభ్యర్థులను తీసుకువెళ్లేందుకు కండిషన్‌లో ఉన్న 7 బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్, తాగునీరు, పండ్లు ఉంచాలని, ప్రతి బస్సుకు కానిస్టేబుల్‌ను నియమించాలని, అభ్యర్థులు అందరూ ముందు రోజు(8వ తేదీన) సాయంత్రం వరకు జిల్లా కేంద్రానికి చేరుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, వారికి జిల్లా కేంద్రంలో వివిధ వసతి గృహాలలో బస ఏర్పాటు చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 9వ తేదీ ఉదయం 4 గంటలకు బస్సులు బయలుదేరాలని ప్రయాణం మధ్యలో అల్పాహారం ఏర్పాట్లు చేయాలని సహకార శాఖ అధికారిని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా హైదరాబాద్ తీసుకెళ్లి నియామక పత్రాలు తీసుకున్న తర్వాత తిరిగి ఇంటికి చేరుకునేలా అధికారులు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని తెలిపారు.

దుర్గామాత ఆలయంలో పూజలు

నవతెలంగాణ-రెబ్బెన

శరన్నవరాత్రులను పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓసీ వద్ద గల దుర్గామాత ఆలయంలో జీఎం దంపతులు ఎం.శ్రీనివాస్ ఉమారాణి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. నిత్యాపూజ, దుర్గా హవనం, కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యకర్యక్రమాన్ని జీఎం ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. సమీప గ్రామాల నుండి భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఖైరగూడ పీఏ దంపతులు ఎం.నరేందర్ నలిని, మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఓ రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
మంగళవారం | అక్టోబర్, 08 2024 | www.navatelangana.com

ఘనంగా ప్రారంభమైన పద్మల్‌పురి కాకో ఉత్సవాలు

నవతెలంగాణ-దండేపల్లి



ఆదివాసుల ఆరాధ్య దైవం పద్మల్‌పురి కాకో దండారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండంలోని గుడిరేవు గోదారి ఒడ్డున కాకో ఆలయంలో ప్రతి ఏటా దసరా పండంగ అనంతరం వచ్చే అశ్వాయుజ పౌర్ణమితో దండారి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 15 రోజుల పాటు గుడిరేవు ప్రాంతం గిరిజనులు గుస్సాడీ నృత్యాలు చేస్తూ దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. జిల్లాతో పాటు పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి గిరిజనులు ఎద్ద సంఖ్యలో తరళివస్తారు.

తోళ్ల వాగును కబ్జా నుంచి కాపాడాలి

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల, నస్పూర్ పట్టణాల మధ్యలో ఉన్న తోళ్లవాగు కబ్జాలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తోళ్లవాగు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలలో విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నాయని, దాని వల్ల వాగు ఉనికి ప్రమాదకరంగా మారిందన్నారు. గత ఏడాది వర్షాకాలంలో వాగు నీటి ఒత్తిడికి గురై నివాస గృహాల్లోకి నీరు చేరిందని దానితో ప్రజలు భయాందోళనలకు గురయ్యారని పేర్కొన్నారు. వాగు బఫర్ జోన్‌లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా రవీంద్ర సింగ్‌ను గెలిపించాలి

- శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య



నవతెలంగాణ-జన్నారం

పట్టభద్రుల అభ్యున్నతికి కృషి చేసేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్ర సింగ్‌ను గెలిపించాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చెన్నమల చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా పనిచేసిన వారు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అటువంటి వారికి పట్టభద్రులు ఓటు వేయొద్దని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆహర్నిశలు కృషి చేసిన రవీందర్ సింగ్‌ను అత్యధిక మెజారిటీతో గలిపించాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్‌కుమార్, మహేష్, గోపతి అన్వేష్, బోడకుంట రమేష్, జింక వెంకటేష్, మామిడిపల్లి సాయి, గద్దల కిరణ్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. సోమవారం కోటపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) కోటపల్లి మండల కార్యదర్శి బోడంకి చందు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఆవాస్ యోజన పథకం ద్వార ఇండ్లు, పోడు భూములకు హక్కు పత్రాలు, పంటలకు గిట్టుబాటు ధర, ఉపాధి హామీ పథకం ద్వార 200 రోజుల పని దినాలు, రోజు వారి కూలీ రూ. 600 కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రేషన్ ప్రతి మనిషికి 20కిలోల చొప్పున ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలం రూ.10 లక్షలు నగదు సహాయం ఇవ్వాలని మహాలక్ష్మి పథకం ద్వార నెలకు రూ.2500 చొప్పున ప్రతి మహిళకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతులందరికి భేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, కౌలు రైతులకు రైతు బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలాల పరిధిలో కుల వివక్ష నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. అన్ని గ్రామాలకు రవాణ సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రవాలలు, తరగతుల వారిగా బేంచీలు, ఫ్యాన్లు, తాగు నీటి వసతి కల్పించాలని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి గ్రామీణులకు ఉన్నత చదువులు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా నాయకులు సిడం సమ్మక్క, సామల ఉమారాణి, బోగె నాగజ్యోతి, బోగె సత్యం, లక్ష్మక్క, లక్ష్మన్, బోయిరె రమాదేవి, జడల యామిని, బాపు, రాజన్న, మహంకాళి, రామయ్య, నగేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ తలారి రాజు, నస్పూర్ పట్టణ నాయకులు గరిగంటి రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో దాదాపుగా 130 అవుట్‌సోర్సింగ్ కార్మికులు, 86 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని వారికి గత ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇప్పుడున్న ధరల రీత్యా వారికి వచ్చే జీతం కూడా సరిపోదని, అలాంటిది 5 నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. అంతేకాకుండా తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు కూడా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబంలో సంతోషాలు కరువయ్యాయని తెలిపారు. దసరా పండుగలోపు కార్మికులకు జీతాలు చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మండల విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో సీటు

నవతెలంగాణ-దండేపల్లి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌లో సీటు సాదించారు. గూడె గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనగంటి మల్లేష్ కుమార్తె సుహితవర్మ నిర్మల్ జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలలో సీటు సాధించింది. అదేవిదంగా నర్సాపూర్ గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ సీనియర్ లైన్‌మెన్ పూరెళ్ల నాగన్న కుమార్తె శ్రీజ హైదరాబాద్‌లోని టీఆర్ఆర్ వైద్య కళాశాలలో సీటు సాధించింది.

గంజాయి విక్రయాలను అరికట్టాలి


నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో గంజాయి విక్రయాలను అరికట్టాలని సీపీఐఎంయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు బెల్లంపల్లిలోని పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమలను కొంత మంది అక్రమార్కులు రాజకీయ అండదండలతో కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను గుర్తించి గుర్తింపు బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణతో పర్యాటక అభివృద్ధి

- డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్

నవతెలంగాణ-కాసిపేట



వన్యప్రాణి సంరక్షణతో పర్యాటక అభివృద్ధి జరుగుతుందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ధర్మారావుపేట అటవీ సెక్షన్ పరిధిలోని బుగ్గగూడెం గ్రామంలో అటవీ శాఖ అధికారులు వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా గ్రామస్తులకు ఆటవీ, వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ భవిష్యత్తులో వన్యప్రాణుల సంరక్షణకు పాటు పడి వాటి మనుగడ అడవుల్లో ఉండేట్టు చేస్తే, మనకు రానున్న రోజుల్లో పర్యాటకం ద్వారా ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే కొత్తగా వచ్చిన వన్యప్రాణి సంరక్షణ చట్టం గురించి వివరిస్తూ నేరం రుజువు అయితే, అంతకు ముందు ఉన్న శిక్షలకు. రెట్టింపు శిక్షలు ఖరారు చేసారని, పంట రక్షణ కోసం సోలార్ విద్యుత్తు మాత్రమే వాడాలని, కరెంట్ వైర్లు పెడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలుపుతూ మన పరిసరాల్లో సీతాకోక చిలుకల ఉద్యానవనం, పక్షులను వీక్షించడానికి బుగ్గ చెరువు వద్ద బర్డ్స్ వ్యూ పాయింట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే బుగ్గ దేవాలయ పరిసర ప్రాంతాలు ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా చేయాలని, అడవిలోని వన్య ప్రాణులు, కోతులకు ఆహారం బయట నుండి ఇవ్వడం వల్ల, ప్లాస్టిక్ వ్యర్థాలు తిని చాలా అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితులు మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ కుమారస్వామి, వాచర్ పోశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన దుమల ఎల్లయ్య కుమార్తె నాగమణి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. దీంతో ఆమెని సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జు పటేల్ శాలువాతో సత్కరించారు. పేద కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. నాగమణి ఎంబీబీఎస్ పూర్తైన తర్వాత డాక్టర్ వృత్తిలో ఉంటూ పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ నాయకులు దు మల రమేష్, ప్రశాంత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో ఘనంగా మహా చండీయాగం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీ దుర్గా భవాని భక్తమండలి హిమ్మత్ నగర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా మహా చండీయాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జుమ్మిడి లక్ష్మణ్-అంజలి, ఈద చందు-తిరుమల, కొండవేణ శ్రీకాంత్-జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుడు ముప్ప సాగర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో గత మూడు సంవత్సరాలుగా దుర్గ మాతను ప్రతిష్టించుకొని నవరాత్రులు భక్తి శ్రద్దలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు క్షేమంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు గరిగంటి రాజయ్య, అడప తిరుపతి, గజ్జి రవి, మైలగాని సాగర్, కొండవేణ కొమురయ్య, భార్గవ్ సాయి, అనుదీప్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఉరిరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని చెల్లంపేట గ్రామానికి చెందిన జైనేని భీమక్క(35) ఆదివారం మధ్యాహ్నం తాగిన మైకంలో భర్తతో గొడవపడి ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు అదే గ్రామానికి చెందిన జైనేని రవితో 20 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి సంతానం కల్గలేదు. ఇద్దరు కూలి పని చేస్తూ రోజు అతిగా మధ్యం తాగి గొడవ పడేవారు. తాగిన మైకంలో భర్తపై చేయి చేసుకుంటుందని స్థానికులు, కుటుంబీకులు చెప్పారు. అదే క్రమంలో ఆదివారం ఉదయం నుంచి ఇద్దరు గొడవపడ్డారు. భర్తను కొట్టి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకొని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తమ్ముడు చేదం రాజన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-జన్నారం

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ భూమి పూజ చేశారు. సోమవారం మండలంలోని కామాన్పల్లి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ కు భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్ఓ ఎఫ్‌బీఓల వసతి గృహాలను ప్రారంభించారు. అనంతరం అక్కడ నిర్వహించిన సమావేశంలో జాతీయ వైల్డ్ లైఫ్ వారోత్సవాల సందర్భంగా పలువురు అటవీ అధికారులు అడవి అభివృద్ధికి వన్యపాణి సంరక్షణకు చేసిన కృషిని గుర్తించి వారికి మేమంటొలు అందజేశారు. పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలో నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు అనంతరం గ్రామపంచాయతీలో ఐకేపీ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని రోటి గూడ గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. చింతగూడ గ్రామంలో నూతనంగా నిర్మించే సైడ్ ట్రేడ్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా ఉంటుందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో భారీ వాహనాల రాకపోకలపై త్వరలో స్పష్టత ప్రకటిస్తుందన్నారు. త్వరలో మంత్రులు సీతక్క కొండ సురేఖ ఈ ప్రాంతంలో పర్యటించి ఇక్కడి ప్రజా సమస్యలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ సుష్మారావు, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం బుచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, పార్టీ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, ఇసాక్, మోహన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రం ఏర్పాటు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 07-మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన వారు తమ ఓటు నమోదు చేసుకోవాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఫామ్-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఫామ్-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారాలను నింపి పాస్ ఫోటో, సంబంధిత పత్రాలు జత చేసి తహసీల్దార్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వాలని, ఆన్‌లైన్‌లో సీఈఓ తెలంగాణ వెబ్ సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6న చివరి తేదీ అని, ఈ అవకాశాన్ని అర్హత గల వారు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

పాత పెన్షన్ హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన పాత పెన్షన్ హామీని నిలబెట్టుకొవాలని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముఖ కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీమ్ స్థానంలో 1980 ఆంధ్రప్రదేశ్ పెన్షన్ రూల్స్ ప్రకారమే పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావడానికి కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించుకోవడం జరిగినదని, అనుకున్నట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పాత్ర ఉందన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులు సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ పునరుద్దరణ ప్రకటనకు అనుకూలంగా జీఓను జారీ చేయాలన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రకాష్ బానావత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మధ్యపానంపై నిషేదాజ్ఞలు

- అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్స్‌పై చర్యలు

నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో మద్యం బహిరంగ ప్రదేశాల్లో సేవించడం నిషేదం కొనసాగుతున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మద్యం ప్రియులు ఆగడాలపై పిర్యాదుల పట్ల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం అన్ని వర్గాల వారికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. ప్రజల భద్రత రక్షణ కోసం నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ప్రకటించినట్లు తెలిపారు. కాగా అక్టోబర్ 1 నుండి నవంబర్ 01 వరకు ఈ నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయని అన్నారు. అదేవిధంగా డీజే సౌండ్‌ల వినియోగంపై నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలు, వృద్దులు, రోగులు, విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని శబ్ద కాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్స్ వినియోగంపై నిషేదం కొనసాగుతుందని తెలిపారు. తప్పని సరై వినియోగించాలని అనుకునే వారు డివిజన్ పరిధిలో ఏసీపీల ద్వార అనుమతి పొందాలని సూచించారు.

మల్కెపల్లిలో పంటల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి గ్రామంలోని వరి పొలాలను వ్యవసాయాధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి పంట పిలక దశ నుంచి పొట్ట దశలో ఉందని, ప్రస్తుతం వరి పంటలో ఆకు ముడత పురుగు, కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు అధికంగా ఉందని, వరిలో ఆకు ముడత పురుగు నివారణకు, కాండం తొలిచే పురుగు నివారణకు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, జింకు లోప నివారణకు చేయాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి చల్లా ప్రభాకర్, ఏఈఓ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రూ.10.17 కోట్లతో అభివృద్ధి పనులు

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల వారిగా రూ.10.17 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు కెటాయించారు. గత ప్రభుత్వం ఆమోదించిన పనులకు గాను డీఎంఎఫ్‌టీ నిధులు నుంచి 2022-23 సంవత్సరంలో 257 పనులను ఈ నిధులతో పూర్తి చేయనున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు గత ప్రభుత్వంలో ఆమోదించిన పనులను సవరించి కలెక్టర్ కుమార్ దీపక్ నిధులు కెటాయించారు. ఈ నిధులతో కోటపల్లి మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలు, జైపూర్ మండల పరిధిలో 19 గ్రామాలు, చెన్నూర్ మండల పరిధిలో 19 గ్రామాలు, భీమారం మండల పరిధిలో 8 గ్రామాలు, మందమర్రి మండల పరిధిలో 9 గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

పనులల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



గ్రామ పంచాయతీల నిర్వాహణతో పాటు వసతుల కల్పనలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు సూచించారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. దసరా, బతుకమ్మ పండుగలను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగాలని ఆదేశించారు. పని చేయకుండా ఉన్నటువంటి వీది దీపాల స్థానంలో కొత్తవి అమర్చాలని సూచించారు. అదేవిధంగా బతుకమ్మ చీరల పంపిణీ ఏర్పాటు, నర్సరీల నిర్వాహణ విషయంలో ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని, నర్సరీ ఏర్పాటు స్థలం గుర్తింపు, మట్టి రవాణాపై దృష్టి పెట్టాలని తెలిపారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీల పరిధిలో హౌజ్ టాక్స్ కలెక్షన్, తాగు నీటి సరఫరాపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఏపీఓ, ఏపీఎం, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ఫ్రీ సీట్‌కు ఎంపికైన ఆదివాసీ విద్యార్థిని

నవతెలంగాణ-జైపూర్

మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి బిడ్డ కూన సాయి వర్మ ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించింది. హైదరాబాద్‌లోని మెడి సిటీ కళాశాలలో ఎంబీబీఎస్ ఏ క్యాటగిరీలో ఫ్రీ సీటుకు ఎంపికైంది. నీట్ పరిక్షకు హాజరైన సాయి వర్మ షెడ్యూల్డ్ తెగలకు చెందిన విభాగంలో రాష్ట్ర స్థాయిలో 518 ర్యాంకు సాధించినందుకు గ్రామస్థులు అభినందించారు. కూన స్వప్న లక్ష్మి రాజం విద్యుత్ శాఖ ఉద్యోగిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తూ తన కూతురు సాయి వర్మను వివిధ ప్రాంతాల్లో చదివించాడు. నీట్ పరిక్షకు హాజరైన సాయి వర్మ ఎస్టీ క్యాటగిరీ నుంచి రాష్ట్ర స్థాయిలో 518 ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని సాయివర్మ తల్లి తండ్రులు కూన స్వప్న లక్ష్మిరాజ్యం తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 08, 2024 | www.navatelangana.com

ఐకేపీ వీఓఏల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఐకేపీ వీఓఏల పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. డీఆర్డీఓ దత్తరంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. దసరా పండుగ నేపథ్యంలో వీఓఏలకు వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండగ పూట పస్తులతో ఉండాల్సిన పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి, మండల అధ్యక్షుడు బుద్దు, కళ్యాణి, పద్మ, ఫర్జానా, శారదా పాల్గొన్నారు.

డీజే, బాణసంచా వినియోగంపై నిషేధం

నవతెలంగాణ-సారంగాపూర్



మతపరమైన ఊరేగింపులో డీజే, బాణాసంచా ఉపయోగించడం నిషేధమని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని డీజే యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృదయ సంబంధ, వినికిడి సంబంధ, సమస్య, సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధుల ఆరోగ్యం దెబ్బతింటుందనే కారణంతో ఇకపై నిర్మల్ జిల్లాలో ఊరేగింపుల్లో డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫైయర్, బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ, పై అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే పోలీసు యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జోడేఘాట్‌లో ఈనెల 17న జరగనున్న కుమురంభీమ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. సోమవారం ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులతో కలిసి భీమ్ వర్ధంతి వేడుకలకు సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీమ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహావీరుడు భీమ్ అని అన్నారు. వర్ధంతి వేడుకల నిర్వహణలో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు, వర్ధంతి వేడుకల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీపై విచారణ జరపాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ బీఈడీ కళాశాలపై ఇటీవల వచ్చిన అక్రమాల ఆరోపణల నేపథ్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్‌తో కలిసి కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల యాజమాన్యం ఇష్టారీతిన వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నట్లు రుజువైందన్నారు. అయిన ఎటువంటి విచారణ జరపకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు అలాగే కొనసాగుతున్నాయన్నారు. వెంటనే అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి ఆలయ చైర్మెన్‌గా నూతనంగా నియమితులైన కొడకల శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్‌ని శాలువాతో సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహాలక్ష్మి ఆలయం వద్ద జగబోయే దసరా ఉత్సవాల ఏర్పాట్ల గూర్చి చర్చించారు. వేలాది మంది భక్తులు దసరా ఉత్సవాల్లో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుంటారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పురపాలక సంఘం తరపున అన్ని రకాలుగా సౌకర్యాలు, కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మెన్ వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, బంగల్‌పేట్ కాలనీవాసులు, పెండం శ్రీనివాస్, బిట్లింగ్ అనిల్, రాహుల్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కార్యకర్తలు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బషారత్ ఖాన్, సకారం, మాజీ ఎంపీటీసీలు వెంకన్న, సాయి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శేఖర్, నాయకులు శ్రీనివాస్, పుల్లూరి సతీష్, అమీరొద్దీన్, షౌకత్ ఆలీ, రామకృష్ణ, ఇస్తారే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మ్యూటేషన్ ప్రక్రియ తిరిగి ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత మే నెలలో ఆడిపోయిన మ్యూటేషన్ ప్రక్రియ సోమవారం నుంచి తిరిగి ప్రారంభమైనట్టు సబ్ రిజిస్ట్రర్ అప్పారావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఐజీ కరీంనగర్, డీఐజీ కార్డ్ ఆదేశాలతో ఈ ప్రక్రీయను ప్రారంభినట్టు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వద్ద నుంచి అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారిలతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో అధికారులు సమస్త పరిష్కారం కోసం కృషి చేస్తే జిల్లా కేంద్రానికి వచ్చే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులకు సంబంధించిన పూర్వాపర వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి అసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్ : ప్రజావాణిలో ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 82 మంది దరఖాస్తుదారులు తమ అర్జీలు సమర్పించారని తెలిపారు. ఆ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులతో మాట్లాడుతూ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆన్నారు. అర్జీ సమర్పించిన మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు రెండు మూడూ రోజుల్లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. ప్రజావాణిలో కొంతమంది జిల్లా అధికారులు సంజయ్ గాంధీ పాలిటెక్నిక్, లైబ్రరీ, కమర్షియల్ టాక్స్, తదితర శాఖల అధికారులు గైర్హాజర్ కావడంతో తప్పనిసరిగా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదులలో హాజరు కావాలని ఆదేశించారు. టీచర్ల నియామక పత్రాలు హైదారాబాద్‌లో సీఎం చేతుల మీదుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్ ఏర్పాటు చేయాలని డీఎంను ఆదేశించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తు పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని త్వరగా పరిష్కరించాలని ఆన్నారు. ప్రజావాణిలో ఎక్కువగా విద్యుత్, మహిళా శిశు సంక్షేమశాఖ, వైద్యం, పెన్షన్, రుణమాఫీ, టీచర్స్‌లకు సంబంధించిన 82 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను ఆమె స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐటీడీఏ ముందు ఆదివాసులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ పరిధిలోని సివిల్ కేసుల దావాలు ఫైల్ చేసే అధికారం ఐటీడీఏ పీఓకు ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలో సివిల్ కేసులు కలెక్టర్లకు బదిలీ కాకుండా ఐటీడీఏ పీవో ద్వారా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని తెలిపారు. ఇంద్రవెల్లిలో ప్రభుత్వం భూముల్లో అక్రమంగా కట్టుకున్న ఇండ్లను కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చేశారని, గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలు తెలుసుకుని కూడా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. గిరిజనేతరులు 1/70, పీసా చట్టాల గురించి తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు మాట్లాడుతూ జైనూర్ ఘటన కారకుడిని కఠినంగా శిక్షించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే తమకు 15 రోజుల గడువు ఇచ్చారని, ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. అందుకే ఐటిడిఎ ముందు ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పీఓ కుష్బూగుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుడిమెత తిరుపతి, సోయం రాందాస్, మడావి దత్తు, మనోజ్, నాగ్‌రాజ్, రోషన్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

నవతెలంగాణ నస్పూర్



జిల్లాలో షెడ్యూలు తెగల ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ వెంకటేశ్వర్ రావు, జిల్లా గిరిజన అబివృద్ధి అధికారి గంగారాంలతో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుకు పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాలలో విద్యుత్ శాఖ సంబంధించిన సబ్ స్టేషన్ల ఏర్పాటు, 3 ఫేజ్ ఇతర సమస్యలు, షెడ్యూల్డ్ తెగల నివాసాలకు విద్యుత్ కనెక్షన్లు ఇతర పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు. గ్రామపంచాయతీ అంతర్గత రహదారులు మండల కేంద్రానికి అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణాలు, పాక్షికంగా దెబ్బతిన్న అంతర్గత రహదారులు, వంతెనల మరమ్మతు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. మిషన్ అంత్యోదయ పథకంలో భాగంగా షెడ్యూల్డ్ తెగల గ్రామాలలో ఉన్న ఖచ్చా ఇండ్లను గుర్తించాలని, ఆయా గ్రామాలలోని ఇండ్లకు తాగునీటి సరఫరా, వాటర్ ట్యాంకులు, మిషన్ భగీరథ కనెక్షన్లు, పైపులైన్లు పూర్తి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని, అవసరమున్న ప్రాంతాలలో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ బాలకృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గనులపై దుర్గామాత ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నస్పూర్

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె-6 గనిలో గని మేనేజర్ తిరుపతి దంపతులు దుర్గామాత ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ దంపతులు బోనం సమర్పించారు. అనంతరం సహపంతి భోజనాలక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరే-6 మేనేజర్ మాట్లాడుతూ గని అమ్మవారు ఎంతో మహిమ గల దేవత అని ఈ నవరాత్రి ఉత్సవాలలో ఉద్యోగులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. సేఫ్టీ జీఎం రఘు కూమార్ కుటుంబ సమేతంగా వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామంలోని పలు దుర్గాదేవి మండపాల్లోని విగ్రహాలకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండప సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, యువ నాయకుడు పిడుగు అభిరామ్‌రెడ్డి, ఆశన్న యాదవ్, మేకల రవికాంత్ యాదవ్, మగ్గిడి ప్రకాష్, మహేశ్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో..

దహెగాం, పర్ధాన్‌వాడ, బీసీ కాలనీ, ఉండం ఎస్సీ కాలనీలలో ప్రతిష్టించిన దుర్గామాత మండపాల వద్ద సోమవారం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్, వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ లస్మన్న, రామచందర్ దేశ్‌ముఖ్, పోతయ్య, రఫీక్, సురేందర్, మహేందర్, అప్సర్, లక్ష్మణ్ యాదవ్, బాస్కర్, నారాయణ పాల్గొన్నారు.

9న ఎమ్మార్పీఎస్ నిరసనను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగ, ఉపాధి, విద్యారంగాలలో మాదిగ నిరుద్యోగులకు, విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసానికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ చౌక్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ మొదటి రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీలో ఉద్యోగాలను భర్తీ చేస్తూ మాదిగలకు రావాల్సిన ఉద్యోగాలను మాలలకు దోచిపెడుతున్నాడని మండిపడ్డారు. 9న చేపట్టే మహాప్రదర్శన విజయవంతం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, మాదిగ ఉప కులాల ప్రజా సంఘాలు, మేధావులు, నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు మోడిపల్లి మనోజ్, సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, ఆరేపల్లి గణేష్, గైక్వాడ్ సూర్యకాంత్, పసుల వేణు, రెంజర్ల రాజు ఇస్తారి, రాకేష్, లక్ష్మణ్, గణేష్, మరి దీపక్, ప్రణయ్ పాల్గొన్నారు.

10న బతుకమ్మలకు బహుమతులు

నవతెలంగాణ-రెబ్బెన

బతుకమ్మ పండుగా నేపథ్యంలో ఈనెల 10న అందంగా ఆలంకరించిన బతుకమ్మలకు బహుమతులను అందజేస్తామని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ తెలిపారు. సద్దుల బతుకమ్మ పండుగ(ఫ్యామిలీ డే) వేడుకలను గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్, మాదారం రామాలయం ప్రాంగణంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాల్లో అందంగా అలంకరించి వచ్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. అంతేకాక ఎంపిక చేసిన మరో 10 బతుకమ్మలకు కూడా ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. గోలేటి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్, మాదారం రామాలయం ప్రాంగణంలో ఈనెల 10న సాయంత్రం 6గం.ల నుండి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు అమ్మవారికి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని బాల సాయి గణేష్ మండలి వద్ద సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా మండపానికి విగ్రహ దాత వేణుగోపాల్ దంపతులు వ్యవహరించగా, సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి దాతగా గాధవేని మల్లేష్ దంపతులు వ్యవహరించారు. కమిటీ సభ్యులు ఆంజనేయులు, సురేష్ తదితరులు కార్యక్రమ విజయవంతంకు కృషి చేశారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆర్టీసీ ఆర్ఎం సొలొమాన్, డిపో మేనజర్ కల్పన పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ డీజే పాటలకు ఆర్టీసీ మహిళల ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. అలాగే ఆర్టీసీ ఆర్ఎం సైతం పాల్గొని బతుకమ్మ ఆడారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని విద్యానగర్ కాలనీ దాసాంజనేయ ఆలయంలో త్రినేత్ర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం దుర్గామాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పండితులు గొంగళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం సాగింది. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి వేద పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారిని ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో ఆరాధించారు.

సిరికొండ : మండల కేంద్రంలోని బోయవాడ కాలనిలో సోమవారం మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తమిళనాడులో గుస్సాడి ప్రదర్శన

నవతెలంగాణ-ఇచ్చోడ

తమిళనాడులోని కోయంబత్తూర్ ఈషా యోగా సెంటర్లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్రం తరపున మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్, ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో ఖీక్రీ డెంసా, గుస్సాడి బృందాలతో ప్రదర్శన నిచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరపున ప్రదర్శనలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం కార్యదర్శి ఆనంద్, ఖీక్రి విద్యా కారులు కాత్లే లక్ష్మణ్, డెంసా బృంద నాయకురాలు సలాం జల్కార్‌దేవి, గుస్సాడి బృంద నాయకులు మెస్రం ప్రకాష్, సభ్యులు గంగారాం, రాము, తులసి, సరస్వతి, వనిత, సుజాత, అనసూయ, లలిత, బోవెన్‌రావు, జగదీష్, అనిల్, గజానంద్, దత్తు పాల్గొన్నారు.